# స్నేహ సుందరి

బోయి భీమన్న

# ධර්මයේ ශ්‍රේෂ්ඨ

[illegible]

ప్రగతి :

(సాలోచనగా) మహాకవి ? ప్రజలు ?

బుద్ధమూర్తి :

లోకానికేమో కాని, నాకు మాత్రం అతడు మహాకవి, నేను అతడి మిత్రుడ్ని, వాళ్ళంతా అతడి ప్రజలు, అటు ప్రజల్నీ, ఇటు మమ్మల్నీ క్షణ క్షణమూ హెచ్చరిస్తూ, అనుక్షణమూ వెన్నంటి వస్తున్న గౌతమీ పుత్ర.

ప్రగతి :

(ఉద్వేగంతో) గౌతమీ పుత్ర, ఏడీ ? ఎక్కడ ? (ఒక వైపుకు పరిగెత్త బోగా, ఎదురుగా మార్గమిత్ర ప్రవేశిస్తాడు. ఆ వెనుక ప్రగతి అంటూ ప్రజలు ప్రవేశిస్తారు.)

బుద్ధమూర్తి :

(మార్గ మిత్రతో) ఇదిగోనయ్యా, నీ ప్రగతి (ప్రగతితో) ఇదిగో నమ్మా, నీ మహాకవి గౌతమీపుత్ర, నీ అనుచరుడు, ఆరాధకుడు.

ప్రగతి :

(కేలు మోడ్చి) నేనే అతని అనుచరిని, ఆరాధకురాలిని, మహాశయా అతణ్ని నేనెప్పుడూ చూడకపోయినా, అతడి కవితాదర్శంలో నన్ను నేను దర్శించుకొంటూ, సరిదిద్దుకొంటూ, ముందుకు నడుస్తున్న దాన్ని.

మార్గమిత్ర :

కాదు మహాశయా ? నేనే ఆమె అనుచరుణ్ని ఆరాధకుణ్ని, ప్రజాద్రోహుల్ని, ప్రగతి వంచకుల్ని, అడుగడుగునా నేను నిల్చి గెల్చుకొంటూ వచ్చింది ఈమె స్ఫూర్తితోనే, మూర్తి ఆర్తితోనే.

బుద్ధమూర్తి :

(ఆనందంతో) మీ రిద్దరూ ఒకరికొకరు

* * *

(రెండో ప్రక్కనుంచి ఇప్పటికే ప్రవేశించి వున్న పోలీసులు, వాళ్ళ ఆధీనంలోని, ప్రచార్, శ్రీరాం, దొరబాబు వగైరాలూ, ప్రజలూ ఆ ఇద్దరిమీద పూలవాన కురిపిస్తారు)

ప్రచార్ :

(ముందుకు వచ్చి ఆశ్చర్యంగా) మార్గమిత్ర, గౌతమీ పుత్రే మార్గమిత్ర.

(అంతకు ముందు నుంచే తెరలో నుంచి వినిపిస్తున్న మంగళ గేయంతో అందరూ గొంతు కలుపుతారు.)

గేయం :

ప్రగతికి కవిరా, కవికి ప్రగతిరా,
పరమ శ్రేయో దంపతిరా
కవి భావనయే ప్రగతిరా
ప్రగతి విలాసమే జగతిరా
వేద దర్శనమొ, వీధి నాటకమొ
రాజకీయమొ, రాధాతత్వమొ
భూత భవిష్యత్ సేతువురా కవి
భువికీ దివికీ ధాతువురా
పదరా ముందుకు ప్రగతి పథంలో
ప్రగతి పథంలో పురోజ్యోతిగా
యువజాతిగా విక్రమించాలిరా
నవజాతిగ వికసించాలిరా
ప్రాణికోటిలో మనిషి పుట్టినది
బతుకుల కొరకే కాదురా
మనిషికి మార్గం మానవత, నీ
మనుగడ లక్ష్యం పరమైశ్వర్యం.

* * *

# స్నేహ సుందరి

బోయి భీమన్న

[illegible]

[illegible]

"గడ్డి పిల్ల' అనే పేరుతో ఈ గేయం వ్రాసి పరహారేళ్లయింది. అక్కడక్కడ సవరించి, దీనిని "స్నేహ సుందరి"ని చేసి ప్రకటించే భాగ్యం నేటికి కలిగింది.

దీనిని చక్కగా పాడగల వారి ద్దరు నాటకంగా ప్రదర్శించవచ్చు. ఒక్కొక్క సంభాషణ అనంతరం విడి పోతూ, మళ్ళీ కలుసుకొంటూ వుండాలి. లేక రెండు మూడు సంభాషణ లను కలపవచ్చు కూడ. దృశ్యం మాత్రం పైరు పొదలతో, పువ్వులతో అలంకరింప బడాలి.

అమాయకత్వంనుంచి, విజ్ఞాన సంపన్నతకు స్నేహ ఎలా మారుతూ వచ్చింది ఇందు చిత్రితం, జాతి సౌఖ్య జీవనానికి స్నేహ సానుభూతులే అన్న పానాదులు.

-రచయిత

## (జానపద గేయకథ)

(విద్యావంతుడైన నాగేంద్రశర్మ రోజూ సాయంతనం పైరు చేలల్లోకి షికారు పోవడం వాడుక. ఆ గట్లల్లో పచ్చగడ్డికోసే ఒక కూలీ బాలిక అతనికి స్నేహం అవుతుంది. ఆ స్నేహం దినదిన ప్రవర్ధమానం అయి, కడకు ప్రేమ బద్ధులౌతారా యువతీయువకులిద్దరూ)

అతడు :

పైరుచేల గట్లల్లో
పచ్చగడ్డి కోసేవు
పచ్చ పచ్చ పూలల్లో
పైరుగాలి కాడేవు,

పైరుచేలు, పచ్చగడ్డి
పైడిపూలు నీవేనా?

ఆమె :

పైరుచేలు మావికావు,
పచ్చగడ్డి కామందుకి,
ఈ పువ్వులు చూడూ – పర
మేశుని చిరునవ్వులోయి !

పేదల మాపాటు చూచి
శీదరపడతావు నువ్వు !

అతడు :

శీదర పడుతున్నానా?
శిరమున గైకొన్నాను,
పరమేశుని చిరునవ్వుల
కరుణారసమే లేదని
ఖేదం పడుతున్నాను,
కిల్బిష, మంటున్నాను.

## 2

అతడు :

మొగమునిండ ముచ్చెమట్లు
ముంచి, చేలు నించగా,
పడీ పడీ గడ్డి కోస్తు
పాటకూడ పాడుతావు !
కష్టం కాదా నీకు ?
కాని పనేలా ? బాలా !

ఆమె :

కాని పనా ? చాల్లే,
కామందులు దబ్బిస్తురు:
పాటలెందు కంటావా ?
పనికి సాయ మోయి !
పనులు చేసుకోక పోతే
బ్రతు కెల్లా గడుస్తాది ?

అతడు :

ఇప్పుడు నీ కామందులు
ఇళ్ళల్లో కూర్చుందురు,
వారి కెలా వస్తున్నె
క్షీరాన్నాలు ?

## 3

అతడు :

తామర పూ వంటి నీ
మోము వాడి పోతున్నది
మాడగ నేలా యెండల ?
మానివేయరాదా పని ?
సస్యామల వనసీమల
శ్యామలవై పోతావో!

ఆమె :

పని మానుదునా నేను ?
పంటలెలా పండుతాయి ?
పాడీ, పంటా లేకా --
ప్రజలెల్లా బ్రతుకుతారు ?
చస్తే నే ఛస్తాను
చావుకన్న సుఖముందా ?

అతడు :

ఏమే- నీ యజమానిని
ఎపుడైనా పని చేస్తద ?

ఆమెకు లేనట్టి బెంగ
అబలా, నీ కెందుకే ?
ఊరకొందువా - క్షణం -
ఉర్వర నిను సేవిస్తది.

## 4.

అతడు :

క్షోణిని పుట్టిన దానికి
సుఖపడవలె బుల్లీ !
ఎంతకాల మీ బాధలు ?
ఎందుకోసమీ వ్యథలు ?

ఆమె :

సుఖ పడాలంటావా ?
సోమరి కమ్మంటావా ?
సోమరిపోతుల కుందా
ఈ మహిలో స్థానం ??

అతడు :

సుఖం గౌరవం, అన్నీ
సోమరిపోతులకేనే !
కష్టానికి ఫలముందా
కన్నీరొక్కటి తప్ప ?
ఇచ్చే వాడిని దోచి
పుచ్చుకుంట దీ లోకం.

# 5

అతడు :

మంచి మంచి మల్లెపూలు
మంచి మంచి గులాబీలు
నీ కామందుల కూతురు
నెరుల నింద పెట్టింది,

ఎందుకు, రోజూ ! నీకీ
కందిపూలు ? మోజటే ??

ఆమె :

నా యందం నీ కొస్తద ?
నీయందం నా కొస్తద ?
కందిపూల అందాలు
కందిపూలవే నోయీ !

చూడూ, పొలమంతాను
సుఖం, సుందరం, ఎంతో !

అతడు :

సుఖం నరుల సొమ్మైనా
సుందరం- శివం నీదే
శ్యామల సస్యామృత దే
వత నీవే, మనోహరీ !

బుల్లీ ! నీ పే రెవ్వరు ?
బుట్ట నిండదా యింకా ?

ఆమె :

ఊరు విడిచి రానేలా ?
ఊసులు మొదలెట్ట నేల ?
పేరెందుకులే, ఊరూ
పేరు లేని పనిపిల్లను.

## 6.

అతడు :

చెప్పవద్దులే పేరు,
శ్రీమంతము నీ పేరు,
సుందర వాసంతలక్ష్మి
కెందుకులే ఒక పేరు !
మందారము నీపేరు
మకరందము నీపేరు,
సౌందర్యము నీపేరు,
సౌహార్ధమె నీపేరు,
ఏమున్నది పేరులోన
హృదయము సుందరమైతే,
ప్రేమాత్మక మైతేను
ఏమున్నది పేరులోన ?
మోహన దేవతవు నీవు
"స్నేహా"యని పిల్చుకొందు.

# 7

ఆమె :

ఎన్ని పేర్లు పెట్టావు !
ఎన్ని రుచులు పోశావు !
గడ్డిపిల్ల కేలా,... యీ
గమ్మత్తులు పేరులు ?
అల్లరి పిల్లాడి లాగు
అగుపిస్తున్నావు నాకు,
చాలించూ ఈ నాటికి
సరసాలూ, సాహసాలు.

అతడు :

అల్లరి పిల్లాడినా ?
కల్లలు మాట్లాడితినా ?
ఇంతగడ్డి కోసిస్తిని
ఎంతమంచి వాణ్ణీ !

ఆమె :

గడ్డికోత నేర్చావే !
గడనదిలా గున్నావే !
రైతుల కుఱ్ఱాడివా ?
రాజుల కుఱ్ఱాడివా ?
తెల్పవుగా నీ చక్కటి
తియ్యటి పేరేదో నాకు ?

# 8

స్నేహ :

రోజూ ఈ పాటేళకె
రాజూ లాగొస్తావు,
కనపడ్డా పిల్లలతో
కబురులు సాగిస్తావు.
ఏమీ పనిలేదా ? నీ
కిదే పనా యేంటీ ?

శర్మ :

పనులు చేసుకోక పోతే
బ్రతుకెట్లా గడుస్తుంది ?
సాయంతనమైనా వి
శ్రాంతి వద్దటే జీవికి ?
పనులంటే నువుచేసే
పాడు చాకిరీలు కావు.

స్నేహ :

నీవంటే గొప్పోడివి,
జీవితమే ఆనందం
నేను కూలిపని పిల్లను,
నేను దరిద్రను, దీనను,
బ్రతికిపోదునేమో నీ
పాదరేణువై పుట్టిన !

# 9

శర్మ :

కష్టాలొందగరాని
కన్నెకాలమే నీది,
కలకనీరు తేనెలా
కన్నులలోకి !

ఏడవమోకే బుల్లీ !
ఏడిస్తే సుఖ మొస్తద ?

స్నేహ :

ఏడవడం కన్నా నే
నేమి చేయగలనోయీ ?
ఎందుకని రాశాడో
యీ కర్మల నాకు!

శర్మ :

కర్మల రాసే దెవరే
కష్టం పెట్టే దెవరే ?
కల్కీ ! మన కామందుల
కల్పనలేనే అన్నీ,

వ్రాసేవాడొకడుంటే,
వాడికి బుద్ధే వుంటే,
సుకుమారపు కుసుమాలను
సూదుల కర్పిస్తాడా ?

# 10

స్నేహ (స్వగతం)

సుకుమారపు కుసుమాలను
సూదుల కర్పిస్తావా ?
అన్నము పెట్టేవాడిని
ఆకట మాడుస్తావా ?

నీవున్నా ననుకొంటూ
జీవిస్తూ వున్నాను,
దిక్కెవ్వరు నా కింక
దేవా, నువు లేకుంటే ?

చిన్నప్పటి నుంచీ నీ
చేలల్లో పని చేస్తును,
కోకైనా, రైకైనా
కొనుకో గలిగానా ?

పనిచెయ్యని కనకానికి
పట్టు బట్ట లిస్తావు !
ఏమో నా కేంటో --
హీనంగా వుంది బ్రతుకు

కామందుల యింట్లోను
నామాటే యెవరెత్తరు,
ఎవరో యీ యబ్బాయీ !
ఎంతో కలిసెమ్మాగా,

ఊసాడుతు, పల్కాడుతు
ఉల్లాసం కలిగిస్తడు !

తేజం గల కుర్రాడు,
దేవతలాగున్నాడు,
అందమైన చెలికాడు
అబద్ధం చెపుతాడా ?

పోనీ నాకేలా యీ
లేని పోని చింత,
నిన్నే యీ రూపంలో
నే నూహిస్తానింక.

ఇంత ప్రొద్దు పోయిందే !
ఇంకా రాడేమో చెలి !

కాపాడుము దేవా నను
నీపాదాలకు దాసిని

# 11

స్నేహ :

బద్దకించి వచ్చావా ?

ప్రొద్దు గూకి పోతున్నది !

అబ్బా నీ కోసమెంత

ఆరాటం పడ్డాను !

శర్మ :

బుట్ట పూర్తి చేశావా ?

బులబులగా నింపావా ?

కొడవలిలా తే... నే

కోసి పెడుదును.

స్నేహ :

వద్దులే.. వద్దులే...

సుద్దులెన్నో నేర్పినావు

తడవయ్యిం దేలా? మీ

తల్లిదండ్రు లొద్దన్నారా ?

ఎన్నెన్నో చెప్పాలని

ఎంతో కనిపెట్టాను.

శర్మ :

ఆరాటం పడ్డావా ?

అసలే రానను కొన్నావా ?

స్నేహ :

ముచ్చట గొలిపే కత్తికి
పచ్చినెత్తు రాహారం,
ఉరిమే తరిమే మేఘం
కరుణరసహృది కాదా !
నరతంత్రపు జీవన లో
ప్రాప్తించిన అనుభవాలు
అమృత పాత్రికను కూడా
అనుమానిస్తవి సామీ !

ఎంతపాపినమ్మ నేను,
హృది నొప్పిస్తిని చెలికీ !
తృణపల్లవములు తరిగే
తెరవకు నా కేటి కరుణ !

శర్మ :

ఓహో, భారతి లాగే
ఒల్కిస్తున్నా నమృతం
ఈనాడేమో నీకు
హృదయ వీణ మ్రోగింది !
ఆవేశం పొందావు,
ఆనందం చిందావు,
సుందరతర మయ్యిందీ
చూడూ యీ సస్యేందిర !

## 12

స్నేహ :

ప్రొద్దున్నే కామందుల
ముద్దుల కూతుళ్లంతా
ముఖం కడిగి, తల దువ్వీ,
పూలు పెట్టు కుంటారు.
పుస్తకాలు పుచ్చుకోని
పోతారూ బళ్లోకి.
పాసిమొగం తోటే నేను
పని చేలో మాడాలి,
చదువు లేదు, సంధ్యలేదు,
చచ్చు బ్రతుకు జీవనం--
ఏమో నాకేంటో--
ఎబ్బెరికం పుడుతున్నది.

శర్మ :

మొదటే నే చెప్పలేద
ముద్దుల నీ మోమువాడి
మొద్దుబారి పోతుందని ?
మతిమాలిన యీ సంఘం
మంజుల మాణిక్యాలను
మసిపాతను కడుతుందని ?

# 13

స్నేహ :

తమబిడ్డల గారంగా
తనులాగే చూచుకొంటు,
నన్నేమో కసిరికొట్టి
తన్నడాని కొస్తారు
కామందులు !
బంగారం గిన్నెల్లో
పరమాన్నం పెట్టుకొని,
మూకుడు చిప్పలో నాకు
మురికి గంజి పోస్తారు
కామందులు !

శర్మ :

కల్లా కపటం లేని
కల్వపూల కళ్ళల్లో
నీరు చింద నీయకే
నేర్పులేని పసి దానా !
చెప్పు చెప్పు ఇంకేమిటి
చేసిరో కామందులు !

స్నేహ :

ఇన్నిసార్లు ఈ చేలలో
ఈ పూలతో ఆడుకొంటి,

మాయా మర్మం తెలియకె
మందురాలనై యుంటి.
ఎప్పుడు నీ వగుపిస్తివా
అప్పటినుంచి నీ....
సుంతైనా యీ సీమలు
సుఖం ఈయడమె లేదు.

ఈ పొలాల సౌందర్యం,
ఈ పూల పరీమళం,
అవకాశపు టయోమయం
నవసంధ్యల మాధుర్యం
అన్నీ నీ స్నేహంలో
సున్నాలై పోయాయి.

కన్నీరొక్కటి తప్ప
కనిపించదు నాకేది
చాలించెద నాపనీ ?
చచ్చిపోదునా పోనీ ?

శర్మ :

ఎందుకలా ఏడుస్తవు ?
ఏడిస్తే సుఖ మొస్తద ?
ఎల్ల రుచులు నీలోనే
ఇల్లు గట్టుకొన్నాయీ,

ఇంకేముందీ బైట ?

ఎండాకాలం తప్ప ?

పిచ్చిపిల్ల ! రేపు... ఏం

పెందలకాడే వస్తే...

మంచిమాట చెపుతాను....

# 14

స్నేహ : (స్వగతం)

మంచి మాట చెపుతాడా ?

మానెయి మంటాడా పని ?

గడ్డికోసి యిస్తాడా

గంప నిండుగా ?

రోజూ చెప్పేకన్నా

మోజుమాట చెపుతాడా ?

ఎక్కువ లాలిస్తాడా ?

ఎక్కువ నవ్విస్తాడా ?

తియ్యని పండ్లను తెచ్చీ

తిను మని వేధిస్తాడో !

ఎదర తనుంటేనే నా

యెద యెంతో పొంగుతాది,

ఎక్కువ నాకెందుకూ ?

ఇతరము నా కెందుకూ ?

ఎందుకు రమ్మన్నాడో

పెందలకాడే !

# 15

శర్మ : (స్వగతం)

ఎక్కడనూ కన్పించదు,

ఇంకా రాలేదేమో!

మంచిమాట చెపుతా నని

మధ్యాహ్నామె రమ్మంటిని

ఆ యాకటి కెమ్మోనికి

అందీగల నా అమృతం ?

ఆకాశపు నీలిమతో

ఆడుకునే మబ్బుతున్క

విఛలితమై నా సంగతి

విపులాంబుద మయ్యింది.

ఏ మడి కొట్టుకు పోతదొ,

ఏ యెడారి పసిరిస్తదొ,

మాయా మర్మం తెలియని

మానవ హృదిలో అశాంతి

రేగిన నాడే లోకం
మ్రోగును విప్లవ భేరీ,
    మనుకొందునా దాని
    మంగళతూర్యారవముగ !

విస్తృతావకాశంగా
విమల తృణక్షేత్రంగా
సుప్తావస్త సుఖంచే
సుందరహృది మేల్కొల్పితి
    నవసంధ్యా రాగంలో !
    నందన వన మౌతానా ?

ప్రేమించితి ననీ - తనను
పెండ్లిచేసికొందు ననీ...
చెపితే సంతోషిస్తదా
చింతిస్తదా, నామాట
    మంచిమాట యౌనో, ఏ
    మంకుమాట యౌనో !

ఇంకా రానే లేదో,
ఏ నీడల గూర్చున్నదా
    గట్టుపైని గడ్డిగంప
    కనపడ్డది - కనపడ్డది !

# 16

స్నేహ : (స్వగతం)

చేలల్లో కెవ్వరూను
రాలేదింకా,
రమ్మన్నాడే గానీ
రాలేదింకా తాను,

ఎండ మహా తీక్షణగా
మండబెట్టుతున్నది తల,
చావుతోటే యీ మంటలు
చల్లారతవో బ్రతుకులో !

ఎప్పటికైనా నా
తిప్పలు తప్పేనా ?
మనిషి లాగ జీవించే
మంచిరోజు లొస్తాయా ?
మాలపిల్లనై పుట్టి,
కూలిబ్రతుకు కే నోచి,
పున్నమచందురు కౌగిటి
పొందు గోరుతున్నాను

అందని పండ్లకు మనసా !
అఱ్ఱులు చాచే వేలే ?

# 17

స్నేహ :

ఎవరు కళ్ళు మూసినారు ?
ఎవరమ్మా యీ సాహసి ?
ఏ వసంతు హస్తాలివి ?
ఈ వనమిటు లుప్పొంగే ?

మోడునేల స్పృశియించీ
మోసులెత్త జేసేవు ?
వైశాఖోత్సవ వీధిని
ఈ శాఖకు చోటుందా ?

వ్యర్థ వాంఛలను హృదిలో
అంకురించ నీయరాదు,
పెరిగి అసాధ్యాలై యవి
బీడు పెట్టుతాయి బ్రతుకు,
ఏ మబ్బా ఈ సాహసి
ఇంత మాధురీ మూర్తి !

శర్మ :

సాహసి యెవరంటావు ?
స్వప్నం గంటున్నావా ?
నువుగాకీ వైశాఖో
త్సవమున కెవ్వరు దేవి ?

నిన్ను స్పృశించి వసంతుడె
నిండుదనం పొందుతాడు,
నీకేలా ఆత్మనింద ?
స్వీకరింపు విశ్వాసం,

స్నేహ :

అమ్మ దొంగ బూచోడా !
అదరగొట్టినావు గుండె !
కొంటెపనికి బహుమానం
గొబ్బితేనె యిదె, యింద !

తిను మని కామందురాలు
తేగలు రెండిచ్చె నాకు
తెచ్చినాను నీ కొరకని
తింటావా తేనెతోడ ?

శర్మ :

బృందా సుషమ ఛ్ఛాయల
ప్రేమగీతు లాలపించి,
దిగివస్తూ వుంటావు
దేవతలా నా చేతికి !
తేగలు నే తింటాను,
తిను యీ బత్తాయిపండు

# 18

స్నేహ (స్వగతం)

కొంటె పిల్ల వాడమ్మా,
గుండెల్లో కూర్చున్నడు,
బరువెక్కిన గుండెలతో
పరువులెత్త లేను నేను.

రాజల్లే వున్నాడు,
రాతిరి లాగుంటి నేను
పెండ్లి చేసుకుంటాడా ?
ప్రేమిస్తాడా నన్ను ?

నిజమేనా - నా కష్టం
నిజంగానే తీరుతుంద ?
ఒట్టేసుకు చెప్పాడు,
వట్టిమాట చెపుతాడా ?

ఈ యనంత విశ్వంలో
తృణమాత్రం నరజీవం,
ఏదో ఒక రోజు కొరకు
ఏళ్ళ కొలది జీవిస్తది,

ఈ యెడారి లతకూనకు
ఇక దొరుకుతదో అమృతం !

# 19

స్నేహ (స్వగతం)

ఈ చేలూ, ఈ పువ్వులు,
ఈ సీతా కోక చిలుక,
లీ కొలకుల చెంగల్వలు
ఎంతో ముద మిస్తున్నయ్ ,

.....................................................

ముద్దిదిగో పువ్వా ! ఈ
మొగ్గకూడ ముద్దిస్తది.
అవిగో పూరేళ్ళు రెండు,
అదిరి బెదిరి పరిగెత్తే,
నన్ను చూచి భయ మేమో ?
నా హృదయం తెలియ దేమొ !

.....................................................

.....................................................

ఇంతదాక నా కెప్పుడు
ఇంత సుఖం ఈయ లేదు
ఈ సంధ్యా సుమరాగం
ఈ పువ్వుల నవ్వుల్లో
ఏవో అందాలిప్పుడు
ఈక్షిస్తున్నాను నేను !

.....................................................

.....................................................

ఈ దుబ్బు గడ్డి నా

లే దూడకీ,
ఈ గుబురు చెంగలీ
నా గొబ్బి గోవుకీ,
పాలావు కీ పత్తి రొట్ట-నా
పసిగిత్తకీ జనప కట్ట.

..............................................

..............................................

నా చేతి మేత యీ
నాటితో సరిమీకు
కామందులే యింక
కమ్మగా మేపేరు
మేయండి ఆవులూ, దూడలూ, ఎడ్లు,
మేరలేనీ గడ్డిబీళ్లె మీ దొడ్లు

..............................................

..............................................

పాడియావా, నన్ను
పంపుమా దీవించి,
నీ పొదుగు మా కిచ్చు
నిత్య సౌభాగ్యాలు

పైడి గిత్తా, నన్ను
పంపు మా దీవించి
భద్రమిడు మాకు నీ
బంగారు కొమ్ములు.
నిండు చేలల్లోన

నిర్లక్ష్యముగ మేయు
ఓ బుల్లియాబోత !
జాబు వ్రాస్తూంటావ ?

క్షేత్రలక్ష్మి, మాకు
క్షేమాల నీవమ్మ !
నీ పూజ మరవ నే
నెక్కడున్నా గాని.

పుష్యలక్ష్మి, మరచి
పోవ కమ్మా మమ్ము,
వాసంత లక్ష్మి నీ
వయ్యారి కూతురే
ఆడుకో రమ్మంది,
ఆదరిస్తూ వుండు,

.............................................

.............................................

లీలమ్మా ! మీ యమ్మే
లాలిస్తాది నిన్నింక,
దీవించూ నువ్వు నన్ను
తీయసుఖాలొందా లని,

పరిచారిక లెందుకు, మీ
పనులు మీరె చేసుకోండి
కాంచనమా.... అదే మంచి
కావాలని అడక్కండి

పాలేళ్ళని, పాలేళ్లే
పాతిత్యం పొందుతారు
మానవులు, వాళ్లలోని
మహిమే చస్తుందప్పుడు.
వద్దు వద్దు, సేవక జీ
వన మెవ్వరికీ వద్దు.

........................................

........................................

రేపటినుంచీ నేను
మీపనిలో కిక రాను,
అమ్మగారు ! సెల విచ్చి
అంపండి నన్నింక,

మీ రే నా తలిదండ్రులు
మీ మేలూ మరిచిపోను.

........................................

........................................

నా తల్లీ తండ్రి
నా చిన్నప్పుడె పోతే...
పోషించారిన్నాళ్లూ
పుణ్యాత్ములు కామందులు
ఏమో– నే లేకపోతె
ఇంకొక్కళ్లుంటారు,
కామందుకు పనివాళ్ళే,

కావాల్యేళ్ళైనా.
ఇంత పరిచయం కలిగిన
ఈ పిల్లల్నీ, పొలాన్ని
ఎలా విడిచి పోవాలో.... !
ఎందుకో నీకీ బెంగ !

పారిపోవు చిలుక కేలొ
పంజరం పయిని మమత !
మానవ హృదయం స్నేహా
ధీనం... ప్రేమోపాసం.

కోడెప్పుదు కూస్తుందో
కుల మెప్పుడు లేస్తుందో
..........................................
..........................................
నాయందం, నాచందం,
నా సౌఖ్యం చాడ్డానికి
నా తల్లీ, నా తండ్రీ,
నా చెల్లీ బ్రతికుంటే...
..........................................
కళ్లనీరు రాగూడదు,
కలిగిపోతె నా రాజు
తొలిగానే కళ్లల్లో
తొంగి చూచి కోపించు

........................................................

........................................................

ముసి ముసి నవ్వులు నవ్వే
ముద్దుగడ్డి పువ్వా !
సిగ్గెందుకు నా దగ్గర ?
చిన్నిపెండ్లి కూతురువా ?

నేర్చినావు లేవమ్మా,
కూర్చోవమ్మా జటలో,

........................................................

........................................................

పేరంటా లెవ్వరు నా
పేదబ్రతుకులో ? నీవే
పేరంటాలివి, చెప్పా
పెండ్లిరూపు వచ్చిందా ?

కళ్ళకు కాటుకకోసం
కబురంపితి నమ్మా,
"తనకెందుకు కాటుక" యని
మిణికిందట నీలోత్పల !

పసుపూ కుంకం కోసం
ప్రార్థించితి నమ్మా,
నన్నే అభ్యర్థించె
గున్నమావి బాలెంత !

ఒకటైనా మంచి చీర
ఉంటే బాగుండు నంటి,
సోయగ ముంటే చాలని
సుస్మిత మయ్యింది తీగ !
  పరబాలలకు నాకూ, నం
  దన సీమకు పొందెక్కడ ?

..........................................................

..........................................................

ఎక్కడివో బాజాలు !
ఇటె వస్తు వున్నాయి !
నా కోసమే నేమొ !
నా నోము పండిందొ !

పెండ్లి యవుతున్నదని
పెద్ద యుత్సవంతో
చెప్పుకుందామంటె
చెలులెవ్వ రున్నారు ?

బొట్లు కాటుక లేదు,
కట్ట బట్టా లేదు
చేరనా యీ చిరుగు
చీరతోటే విభుని !

# 20

పేరంటాళ్ళు :

ఎందుకమ్మ కంట నీరు ?
ఎంతో పుణ్యశీల వమ్మ !
బృందావన కృష్ణుడె నీ
డెందంలో ఖైదయ్యె !

కట్ట వమ్మ యీ చీరలు,
పెట్టవమ్మ యీ కాటుక,
ఈ పగలూ, నిగనిగలా
ఎంత మెరిసి పోతుంటివి !

ఎందైనా నీ కంటే
అందెగత్తెలున్నారా
అనిపిస్తున్నది మాకు
ఆశ్చర్యంగా... మా
రాజు కెలా దొరికిందో
రమ్యజ్యోత్స్నాలతిక !!

పగకెంతో అందం నీ
నగవే కూరుస్తున్నది,
అతని జీవితానికి నీ
ఆలింగనమే భూష
ఎక్కవమ్మ పల్లకి
ఎందుకమ్మ సిగ్గా ?

# 21

(నీరాజనం)

బాజాలే... బజంత్రీలు,
పల్లకీలు, పేరటాళ్ళు,
తోరపు నవ్వులు, పువ్వుల
తోరణాలు, గారవాలు;
ఒకటేమిటి... సర్వత్రా
ఉత్సవమే... మహోత్సవం

సర్వోదయ సమాజమే
సాక్షాత్కార మయ్యింది
క్షత్రియ సౌధం హరిజన
సాధ్వీమణి మెట్టుటతో.

సంఘాన్నే ధిక్కరించి,
సంబంధు ల్నెదిరించి,
హైమవతిని బోలిన స్నే
హాదేవిని ప్రేమించి
నాగభూషణుని బోలిన
నాగేంద్రుడు పెండ్లాడె.

భారత జననీ పదసే
వాభాగ్యం గైకొండని

బాపూజీ దీవించె,

బంగారపు చిరునవ్వుతో;

ప్రణయ ప్రణవాక్షతలను

భారతాంబ జల్లిందీ

సుఖజీవులుకండని, తే

జోవంతులుగా మనుడని

పైరు చేలు నవ్వాయి,

పాడిగోవు చేసిందీ,

దంపతు లా మరునా డా

దారులలో విహరించగ.

## 22

అంకితం :

పైరుచేల గట్టులలో

పచ్చగడ్డి కోసేటి

పల్లెటూరి పిల్లలతో

పాటలెన్నొ పాడుకొంటు,

చల్లగ నా భావలతను

పల్లవింప జేసిన మా

యమ్మ "నాగి" పాదాలకు

అంకిత మీ చిరుపాట.

ఊడ్పు చేల మనుమలలో
"ఉయ్యేలా" పాటలతో
విరికన్నెల చిరు గుండెల
వరహాలను పండిస్తూ,
నాశైశవ హృదయంలో
నందనములు నాటిన మా
యమ్మ నాగి చరణాలకు
అంకిత మీ నవగీత

కొబ్బరి మామిడి తోటల,
కోయిల తీయని పాటల
శ్రమనెంచక పనిచేసీ
సంసారం దిద్దుకొంటు,

పెంకెతనపు నా గుండెను
ప్రేమార్ద్ర మొనర్చిన మా
యమ్మ నాగి యడుగులకు
అంకిత మీ శుభ గేయం.

వందేమాతరం.

* * *

Complete works of Boyi Bhimanna - Vol-4 Plays - Part -2

